TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 94 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ బుధవారం.29.10.2025 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD




# సినీ కార్మికులకు సీఎం వరాల జల్లు




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: సినీ కార్మికులపై సీఎం ఏ రేవంత్‌రెడ్డి వరాల జల్లు కురిపించారు. డిసెంబర్ 9 నాటికి వారి సమస్యల పరిష్కారంపై అధ్యయనం చేసి స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు. సినీ కార్మికుల కోసం రూ.10 కోట్లతో వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేస్తామనీ, కొత్త సినిమాలకు టిక్కెట్ రేట్లు పెంచమని నిర్మాతలు ప్రభుత్వం వద్దకు వస్తుంటారనీ, అలా పెంచిన టిక్కెట్ రేట్లలో నుంచి 20 శాతం సొమ్మును వెల్ఫేర్ బోర్డులో డిపాజిట్ చేసేలా ఆదేశాలు ఇస్తామన్నారు. సినీ కార్మికులు కూర్చుని మాట్లాడుకోవడానికి అవసరమైన భవన నిర్మాణం కోసం ఇక్కడికి సమీపంలోనే ప్రభుత్వ భూమిని కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అలాగే కృష్ణానగర్ సహా చిత్ర పరిశ్రమపై ఆధారపడి బతుకుతున్న వారి పిల్లలకు ఉన్నతమైన ఉచిత విద్యను కేజీ నుంచి ప్లస్ టూ వరకు ప్రభుత్వమే అందిస్తుందనీ, దీనికోసం త్వరలో స్కూల్ భవనాన్ని నిర్మిస్తామని తెలిపారు.

ఆ స్కూల్‌లోని పిల్లలకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం కూడా ఏర్పాటు చేస్తామన్నారు. స్టంట్ మాస్టర్ల రిహార్సల్స్ కోసం భూమి కావాలని కోరారనీ, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీలో దానికి అవసరమైన భూమిని కేటాయిస్తామని స్పష్టం చేశారు. సినీ కార్మికుల ఆరోగ్య భద్రతను ఆరోగ్యశ్రీ ద్వారా పరిరక్షిస్తామన్నారు. సినీ కార్మికులకు సొంతిళ్ల ఏర్పాటుపై అధ్యయనం చేసి, కచ్చితంగా సానుకూల నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. నవంబర్ నెలఖరులోపే సినీ కార్మిక సంఘాల నేతలతో మరోసారి భేటీ అయ్యి, అన్ని విషయాలపై చర్చించి, డిసెంబర్ 9 వతేదీ ఆ నిర్ణయాలపై ఉత్తర్వులు జారీచేస్తామని హామీ ఇచ్చారు. మంగళవారంనాడిక్కడి యూసుఫ్‌గూడ పోలీస్ గ్రౌండ్స్‌లో సినీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన పాల్గొని, మాట్లాడారు.

తెలుగు సినీ పరిశ్రమను హైదరాబాద్‌కు తరలించేందుకు ఆనాటి ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి తీవ్రంగా కృషి చేశారనీ, ఎన్టీఆర్, అక్కినేని నాగేశ్వరరావు, సూపర్‌స్టార్ కృష్ణ వంటి వాళ్లతో సుదీర్ఘ సంప్రదింపులు జరిపి, సినీ పరిశ్రమను ఇక్కడకు తరలించారని తెలిపారు. సినీ కార్మికుల సంక్షేమం కోసం అనాటి మేటి నటులు డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి మణికొండలో తన పది ఎకరాల సొంత స్థలాన్ని విరాళంగా ఇచ్చారని గుర్తుచేశారు. ఆ తర్వాతే సినీ కార్మికుల కోసం చిత్రపురి కాలనీ ఏర్పాటైందని వివరించారు. చిత్ర పరిశ్రమలో కళాకారులు రాత్రి, పగలు తేడా లేకుండా పనిచేస్తున్నారనీ, వారి శ్రమ, కష్టం తనకు తెలుసన్నారు. తెలుగు సినిమాను ఆస్కార్ స్థాయికి తీసుకెళ్లడం వెనుక సినీ కార్మికుల కష్టం ఉందన్నారు.

గడచిన పదేండ్లుగా నిలిపివేసిన నంది అవార్డుల స్థానంలో ప్రజా యుద్ధనౌక గద్దర్ అవార్డులను అందిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ నగరం ప్రపంచ సినీ పరిశ్రమకు వేదిక కావాలనీ, తెలంగాణ రైజింగ్-2047 ప్రణాళికలో తప్పకుండా సినీ రంగానికి ప్రత్యేక చాప్టర్ ఉంటుందని చెప్పారు. ఐటీ, ఫార్మా లాగే సినీ పరిశ్రమకు తమ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందన్నారు. హాలీవుడ్‌ను తెలంగాణకు రప్పించే బాధ్యత తానే తీసుకుంటాననీ, ఆ స్థాయిలో తనకు సినీ కార్మికుల సహకారం కావాలని కోరారు. అనంతరం సినీ కార్మిక సంఘాలు సీఎం రేవంత్‌రెడ్డిని ఘనంగా సన్మానించాయి. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ దిల్‌రాజు, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ ఏంటి ఇలా మారిపోయారు?.. రాజకీయ వర్గాల్లో చర్చ



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రెండు సార్లు అధికారంలోకి వచ్చి రాష్ట్ర రాజకీయాలను తన కను సైగతో శాసించిన కేసీఆర్ ముచ్చటగా మూడోసారి గెలిచి హ్యాట్రిక్ కొట్టాలని భావించినా అది సాధ్యపడలేదు. దీంతో 2023 ఓటమితో తర్వాత ఆయన దాదాపు ఎర్రవల్లి ఫామ్ హౌస్ కే పరిమితం అయ్యారు. ప్రజాక్షేత్రానికి దూరంగా ఉంటున్న కేసీఆర్ తాజాగా తన బావ, మాజీ మంత్రి హరీశ్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ పార్థివదేహానికి నివాళి అర్పించారు. ఎర్రవల్లి నుంచి ఇవాళ ఉదయం హైదరాబాద్?కు వచ్చిన కేసీఆర్ హరీశ్ రావును ఓదార్చి తన బావకు నివాళి అర్పించారు. అయితే ఈ సందర్భంగా కేసీఆర్ లుక్స్ రాజకీయ వర్గాల్లో చర్చగా మారింది. ఎప్పుడూ క్లీన్ షేవింగ్‌తో కనిపించే కేసీఆర్ ఇప్పుడు కాస్త గడ్డంతో కనిపించారు. అలాగే గతంలో పోలిస్తే మరింత బలహీనంగా ఉన్నట్లు కనిపించారు. చాలా రోజుల తర్వాత బయటకు వచ్చిన తమ నాయకుడికి ఏమైంది అంటూ బీఆర్ఎస్?లో, రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

## రష్యా నుంచి చమురు కొనుగోళ్లు బంద్ !




న్యూఢిల్లీ : అమృత్ తెలంగాణ: అమెరికా అధ్యక్షుడు డోనాల్ట్ ట్రంప్ ఆంక్షలకు ప్రధాని మోడీ తలొగ్గారు. రష్యా నుంచి చౌకగా లభించే చమురు కాకుండా యూఎస్ నుంచి దిగుమతులను పెంచారు. ట్రంప్ బెదిరింపులకు భపడి రష్యా నుంచి చమురు కొనుగోళ్లను నిలిపివేశారు. ట్రంప్ ఆదేశాల మేరకు రష్యా నుంచి చమురు కొనుగోలుకు భారత రిఫైనరీలు కొత్త ఆర్డర్లు ఇవ్వడం లేదు. తాత్కాలికంగా చమురు కొనుగోలును నిలిపివేశాయి. స్పాట్ మార్కెట్ల నుంచి కొనుగోళ్లతో ఆ లోటును భర్తీ చేసుకుంటున్నామని రిఫైనరీలకు చెందిన కీలక వ్యక్తులు వెల్లడించారు. అమెరికాకు సహకరిస్తామన్న ప్రధాని మోడీ హామీ మేరకు భారత రిఫైనరీలు అమెరికా కంపెనీల నుంచి చమురు బుకింగ్ పెంచుకున్నట్టు వాణిజ్య, ప్రభుత్వ వర్గాల సమాచారం. రష్యా సంస్థలైన రాస్‌నెఫ్ట్, లుకాయిల్‌తో పాటు వాటి అనుబంధ సంస్థల నుంచి అమెరికా కంపెనీలు, వ్యక్తులు చమురు కొనకుండా అక్టోబరు 22న అమెరికా నిషేధం విధించింది. అమెరికాయేతర సంస్థలు కొనుగోలు చేస్తే పెనాల్టీ ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపింది. ఈ రెండు సంస్థలతో కొనసాగుతున్న లావాదేవీలను నవంబర్ 21 నాటికి ముగించాలని ఆదేశాలు ఇచ్చింది. ఈ నేపథ్యంలో అమెరికా విధించిన ఆంక్షలకు భారత్ తలొగ్గి రష్యన్ చమురు దిగుమతులను భారీగా తగ్గించింది. రష్యన్ చమురు ప్రధాన కొనుగోలుదారుగా ఉన్న రిలయన్స్ ఇండిస్ట్రీస్ సైతం రోస్నెఫ్ట్‌తో ఉన్న 25 సంవత్సరాల ఒప్పందం (రోజుకు 5 లక్షల బ్యారెల్స్) కింద కొనుగోళ్లను ఆపేస్తుంది. కొత్త ఆర్డర్లు పెట్టడం లేదని ఆ వర్గాలు వెల్లడించాయి. రిఫైనరీ ఉత్పత్తుల దిగుమతులపై ఈయూ మార్గదర్శకాలకు అనుగుణంగా నడుచుకుం టామని తెలిపింది.

## మావోయిస్టు కీలక నేతలు చంద్రన్న, బండిప్రకాశ్ సరెండర్




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు పుల్లూరి ప్రసాదరావు అలియాస్ చంద్రన్న, రాష్ట్ర కమిటీ సభ్యుడు బండి ప్రకాశ్ అలియాస్ శంకరన్న అలియాస్ ప్రభాత్ మంగళవారం రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట లొంగిపోయారు. ఈ సందర్భంగా డీజీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శివధర్‌రెడ్డి మాట్లాడుతూ.. 20 ఏండ్లుగా మావోయిస్టు పార్టీలో కొత్తగా ఎవరూ చేరలేదని అన్నారు. ప్రభుత్వాలు చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, పెరిగిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు, యువత ఆలోచనా విధానంలో వచ్చిన మార్పులు వెరసి ఈ పార్టీలో రిక్రూట్‌మెంట్ తగ్గడానికి కారణమైందని తెలిపారు. మావోయిస్టు పార్టీలో ఉన్న వారు వెంటనే జనజీవన స్రవంతిలో కలిసి కొత్త జీవితాన్ని ప్రారంభించాలని ఆయన పిలుపునిచ్చారు. సాయుధ పోరాటాన్ని వీడి జన జీవన స్రవంతిలోకి వచ్చిన వచ్చే మావోయిస్టు నేతలకు పూర్తి రక్షణ కల్పిస్తామని డీజీపీ భరోసా కల్పించారు.

కాగా, మావోయిస్టు పార్టీలో 40 ఏండ్లకుపైగా వివిధ స్థాయిల్లో చంద్రన్న పనిచేశారని తెలిపారు. 1980లో పుల్లూరి ప్రసాదరావు కిషన్‌జీకి అనుచరుడిగా పనిచేశారని, 1981లో పీపుల్స్‌వార్‌లో చేరారని వెల్లడించారు. అంచెలంచెలుగా ఎదిగి 1983లో కమాండర్ స్థాయికి వెళ్లి 1992లో ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శిగా పనిచేశారని, 2008లో మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడయ్యారని తెలిపారు. దాదాపు 17 ఏండ్ల పాటు మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడిగా కొనసాగారనీ, ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపుతో బండి ప్రకాశ్‌తో పాటు పుల్లూరి ప్రసాదరావు లొంగిపోయారని స్పష్టం చేశారు.

ఆరోగ్య పరిస్థితి క్షీణించడం, దీర్ఘకాలిక మోకాళ్ల వ్యాధి, భద్రతా దళాల నిరంతర ఒత్తిడి అలాగే సీపీఐ(మావోయిస్టు)లో ఏర్పడిన సిద్ధాంతపరమైన భేదాభిప్రాయాలు, అంతర్గత విభేదాలు వంటి కారణాలతో చంద్రన్న, ప్రకాశ్‌లు పార్టీతో తమ సంబంధాలను తెంచుకొని తెలంగాణ ప్రభుత్వ సహాయంతో జన జీవన స్రవంతిలో తిరిగి చేరాలని నిర్ణయించుకున్నట్టు డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన బండి ప్రకాశ్.. 1984 అక్టోబర్‌లో సీపీఐ నాయకుడు వి.టి అబ్రహం హత్యకు పాల్పడి 1988లో ఆదిలాబాద్ జైలు నుంచి పారిపోయాడనీ, 1999లో మావోయిస్టు ఉద్యమంలో చేరి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడని డీజీపీ తెలిపారు. అబ్రహం హత్య కేసులో జీవిత ఖైదు శిక్ష విధించగా 1992లో మల్కాజ్‌గిరిలో ప్రకాశ్‌ను అరెస్టు చేసి చంచల్‌గూడ జైలుకు తరలించారు.

2004 ఆగస్టులో క్షమాభిక్షపై ఇతను విడుదలయ్యాడు. 2005లో ప్రభుత్వంతో మావోయిస్టులు జరిపిన శాంతి చర్చలు విఫలం కావడంతో ప్రకాశ్ మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. 2015 నుంచి ఇప్పటి వరకు ఇతను సింగరేణి కోల్ బెల్ట్ కమిటీ ఇన్‌చార్జితో పాటు తెలంగాణ రాష్ట్ర కమిగా ప్రెస్ టీమ్ ఇన్‌చార్జిగా కొనసాగుతూ మావోయిస్టు పత్రికా ప్రకటనలను ప్రభాత్ పేరుతో విడుదల చేస్తున్నాడని డీజీపీ వివరించారు. పుల్లూరు ప్రసాద్‌రావు మీద ప్రకటించిన రూ.25 లక్షల నగదు, బండి ప్రకాశ్ పేరు మీద ప్రకటించిన రూ.20 లక్షల నగదు బహుమతిని డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో డీజీపీ వారికి అందించారు. వీరిద్దరికి పునరావాస విధానంలో లభించాల్సిన అన్ని ప్రయోజనాలు అందిస్తామని డీజీపీ స్పష్టం చేశారు.

ఈ ఏడాది లొంగిపోయిన వారి సంఖ్య 427

అజ్ఞాతంలో ఉన్న 427 మంది నేతలు, సభ్యులు ఈ ఏడాది లొంగిపోయిన వారిలో ఉన్నారని డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. వీరిలో ఇద్దరు కేంద్ర కమిటీ సభ్యులు, ఎనిమిది మంది రాష్ట్ర కమిటీ సభ్యులు, ఇద్దరు డివిజన్ కమిటీ కార్యదర్శులు, ఎనిమిది మంది డివిజన్ కమిటీ సభ్యులు, 35 మంది ఏరియా కమిటీ సభ్యులు సాయుధ పోరాటాన్ని వీడి తమ కుటుంబాలతో కలిసి శాంతియుత జీవితం గడపాలని పోలీసుల ముందు లొంగిపోయారని డీజీపీ తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రానికి చెందిన 64 మంది మావోయిస్టులు ఇంకా అజ్ఞాతంలో ఉన్నారన్నారు. సమావేశంలో అదనపు డీజీపీ మహేశ్ మురళీధర్ భగవత్, ఇంటెలిజెన్స్ చీఫ్ విజయ్ కుమార్, ఎస్ఐబీ చీఫ్ బి.సుమతిలతో పాటు లొంగిపోయిన మావోయిస్టు నేతలు పుల్లూరి ప్రసాద్‌రావు, బండి ప్రకాశ్‌లు పాల్గొన్నారు.

## నవంబర్ 15న లోక్‌అదాలత్

హైదరాబాద్ : లోక్ అదాలత్‌లో కేసులను రాజీ చేసుకునేందుకు వీలుగా పోలీసులు కూడా తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటీవ్ చైర్మెన్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్యామ్‌కోషి సూచించారు. మంగళవారం హైకోర్టు ఆవరణలోని లోక్ అదాలత్ అథారిటీ ఆఫీసులో పోలీస్ ఉన్నతాధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. చీఫ్ జస్టిస్ ఏకే సింగ్ సూచనల మేరకు నవంబర్ 15న ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. క్రిమినల్ కాంపౌండబుల్ కేసుల(జరిమానా విధింపుతో పరిష్కారమయ్యే కేసులు)ను అధిక సంఖ్యలో పరిష్కరించేందుకు పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. దీనివల్ల కోర్టులపై కేసుల భారం తగ్గుతుందన్నారు. ఈ మేరకు సహకారం అందిస్తామనీ, పోలీసులకు తగిన ఆదేశాలిస్తామని డీజీపీ బి.శివధర్‌రెడ్డి చెప్పారు. సమావేశంలో పోలీస్ ఉన్నతాధికారులు మహేశ్ భగవత్, చారు సిన్హా, అథారిటీ మెంబర్ సెక్రటరీ పంచాక్షరి, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనర్లు ఇతరులు హాజరయ్యారు.

## 8వ వేతన సంఘానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం




న్యూఢిల్లీ :అమృత్ తెలంగాణ: కేంద్ర ఉద్యోగులు, పింఛనర్లకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. 1.19 కోట్ల మంది ఉద్యోగులు, పింఛనర్ల జీతాలు, పింఛన్లు పెంచేందుకు వీలుగా 8వ వేతన సంఘానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అలాగే రబీ సీజన్ 2025-26కు గానూ ఎరువులపై రూ.37, 952 కోట్ల సబ్సిడీకి గ్రీన్ సిగల్ ఇచ్చింది. మంగళవారం నాడిక్కడ ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో కేంద్ర మంత్రివర్గం రెండు అంశాలపై నిర్ణయం తీసుకుంది. అనంతరం నేషనల్ మీడియా సెంటర్ (ఎన్ఎంసీ)లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ కేంద్ర మంత్రివర్గ నిర్ణయాలను వెల్లడించారు. 8వ వేతన సంఘం (పే కమిషన్) నిబంధనలకు ఆమోదం తెలిపినట్టు చెప్పారు. కమిషన్‌లో ఒక చైర్‌పర్సన్, ఒక సభ్యుడు (పార్ట్ టైమ్), ఒక సభ్య-కార్యదర్శి ఉంటారు.

8వ వేతన సంఘం చైర్మెన్‌గా రిటైర్డ్ జడ్జీ జస్టిస్ రంజనా ప్రకాష్ దేశారు, పార్ట్ టైమ్ సభ్యుడిగా ప్రొఫెసర్ పులక్ ఘోష్, సభ్య కార్యదర్శిగా పంకజ్ జైన్‌ను నియమించినట్టు చెప్పారు. 18 నెలల్లోపు కేంద్ర ప్రభుత్వానికి ఈ కమిటీ సిఫారసులు చేస్తుందన్నారు. కేంద్ర పరిధిలోని 50 లక్షల మంది ఉద్యోగులు, 69 లక్షల మంది పింఛనర్లకు లబ్ది చేకూరనున్నట్టు వెల్లడించారు. కాగా ప్రస్తుత ఏడో వేతన సవరణ సంఘం కాల పరిమితి వచ్చే ఏడాదితో ముగియనుంది. ఈ నేపథ్యంలో కొత్త వేతన సవరణ అమలుకై 2025 జనవరిలో ఎనిమిదో వేతన సంఘం ఏర్పాటును కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దీనిపై పలువురు కేంద్ర మంత్రులు, మంత్రిత్వ విభాగాల సిబ్బందితో విస్తత స్థాయి సమీక్షలు నిర్వహించింది. అనంతరం ముగ్గురు సభ్యులతో ఈ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ చేసే సిఫారసుల ఆధారంగా కేంద్ర ఉద్యోగులు, పింఛనర్ల జీతాలు, పింఛన్లను కేంద్రం సవరించనుంది.

రబీ సీజన్‌లో ఎరువులపై సబ్సిడీకి ఆమోదం

2025-26 రబీ సీజన్ (అక్టోబర్ 2025 మార్చి 2026) కోసం ఫాస్పరస్, పోటాషియం (పి అండ్ కె) ఎరువులపై పోషక ఆధారిత సబ్సిడీ (ఎన్ బిసి) రేట్లను నిర్ణయించడానికి ఎరువుల శాఖ చేసిన ప్రతిపాదనలను కేంద్ర క్యాబినెట్ ఆమోదించింది. ఇందుకోసం రూ.37,952.29 కోట్లు కేటాయించింది. న్యూట్రిషన్ బేస్డ్ సబ్సిడీ పేరుతో నైట్రోజన్, ఫాస్పరస్, పొటాష్, సల్ఫర్లకు కేంద్రం సబ్సిడీ అందించనుంది. నైట్రోజన్‌పై కిలోకు రూ.43.02, ఫాస్పర్ట్ పై కిలోకు రూ. 47.96, పొటాష్‌పై కిలోకు రూ. 2.38, సల్ఫర్‌పై కిలోకు రూ 2.87 సబ్సిడీ కల్పిస్తున్నట్టు వెల్లడించింది.

రబీ సీజన్‌లో డై అల్యూమినియం ఫాస్పేట్ (డిఎపి), మోనో అల్యూమినియం ఫాస్పేట్ (ఎంఎపి), మ్యూరియేట్ ఆఫ్ పొటాష్ (ఎంఒపి), ట్రిపుల్ సూపర్ ఫాస్పేట్ (టిఎస్ పి), 3 గ్రేడ్స్ ఆఫ్ సింగిల్ సూపర్ ఫాస్పేట్ (ఎస్ఎస్ పి), పొటాష్ డెరైవ్డ్ మొలాసెస్ (పిడిఎం), అల్యూమినియం సల్ఫేట్ (ఎఎస్) వంటి దాదాపు 28 ఎన్పికెఎస్ కాంప్లెక్స్ ఫర్టిలైజర్స్‌ను ఉత్పత్తి చేసే కంపెనీలకు న్యూట్రియెంట్ బేస్డ్ సబ్సిడీ అమలు చేయాలని నిర్ణయించింది.

# సీఎంఆర్ సరఫరా వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (CMR) సరఫరా ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజార్షి షా అధికారులు, రైస్ మిల్లర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సి.ఎం.ఆర్ సరఫరా పురోగతిపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సన్నబియ్యం మిల్లింగ్, సరఫరా పనులను నిర్దిష్ట గడువుల్లో పూర్తి చేయాలని సూచించారు. సివిల్ సప్లై కమిషనర్ నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం మిల్లర్లు సి.ఎం.ఆర్ సరఫరా చేయకపోతే ఆర్ఆర్ చట్టం కింద చర్యలు తప్పవని హెచ్చరించారు. 2023-24 సీజన్‌కు సంబంధించిన మిగిలిన నాన్ అకౌంటెడ్ మిల్లర్ల వద్ద ఉన్న సన్న బియ్యాన్ని తక్షణం సరఫరా చేయాలని ఆదేశించారు. డిసెంబర్ చివరి నాటికి వందశాతం సి.ఎం.ఆర్ సరఫరా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి వారం మిల్లర్లు తమ సరఫరా పురోగతిపై యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి నివేదికలు సమర్పించాలనీ ఆదేశించారు. బ్యాంకు రుణ సౌకర్యాల వినియోగంలో మిల్లర్లు తమ మిల్లింగ్ సామర్థ్యం, ఎఫ్ సి ఐ మార్గదర్శకాల మేరకే రుణాలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన అన్ని నిబంధనలను



కచ్చితంగా పాటించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హేచ్చరించారు. మిల్లర్లు సక్రమంగా సన్నబియ్యం మిల్లింగ్ చేసి, సమయానికి సివిల్ సప్లై గోదాములకు అందజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామల దేవి, జిల్లా సివిల్ సప్లై అధికారి నందిని, డిఎం సుధారాణి, అధికారులు, పలు రైస్ మిల్లర్ల సంఘ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# జనన బరువు ఆధారంగా శిశు మరణాల విశ్లేషణ చేయాలి: జిల్లా కలెక్టర్ రాజార్షి షా



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి : జిల్లాలో నవజాత శిశు మరణాలను తగ్గించే దిశగా పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజార్షి షా అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన ఆరోగ్య శాఖ, వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. బిబి నగర్ ఎయిమ్స్ ప్రొఫెసర్ తనిగై నాధన్ జిల్లాలో గత నెలలో నమోదైన శిశు మరణాల గణాంకాలు, జనన బరువు ప్రకారం విభజన, సంబంధిత గ్రామాలు, తల్లుల ఆరోగ్య వివరాలు, తీసుకున్న చర్యలు తదితర అంశాలను వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రులలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. జిల్లాలో నమోదైన నవజాత శిశు మరణాలపై సమగ్రంగా విశ్లేషణ చేయాలని సూచించారు. ఐ సి ఎం ఆర్ సంకల్ప్ లో భాగంగా నవజాత శిశువుల మరణాల సంఖ్య 10 కంటే తక్కువ రావాలని, ముఖ్యంగా జనన బరువు ఆధారంగా శిశు మరణాల సంఖ్యను విభజించి కారణాలను గుర్తించాలని సూచించారు. తల్లుల పోషకాహారం లోపం, గర్భధారణ సమయంలో వైద్య పరీక్షలు చేయించుకోకపోవడం, అనారోగ్య పరిస్థితుల్లో సమయానికి వైద్యసేవలు అందకపోవడం వంటి కారణాల వల్ల తక్కువ బరువుతో పుట్టిన శిశువుల సంఖ్య పెరుగుతోందని అన్నారు. వైద్య, శిశు సంక్షేమ శాఖలు సమన్వయంతో ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి పీహెచ్‌సీ, సబ్‌సెంటర్ స్థాయిలో తల్లుల ఆరోగ్య స్థితి, హీమోగ్లోబిన్ స్థాయి, ఆహారపు అలవాట్లు, ఐరన్ ఫోలిక్ యాసిడ్ వాడకం, పోషకాహార పంపిణీ వంటి అంశాలను సమీక్షించి రిస్క్ కేసుల జాబితా తయారు



సమావేశంలో మాట్లాడుతున్న అదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజార్షి షా

చేయాలని సూచించారు. ఏఎన్ఎమ్‌లు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది సమన్వయంతో ప్రతి గర్భిణీ తల్లిని గుర్తించి, సమయానికి వైద్య పరీక్షలు చేయించుకోవడం, సరైన పోషకాహారం అందించడంలో చురుకుగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ సలోని చబ్రా, జిల్లా వైద్యాధికారి డా. రాథోడ్ నరేందర్, రిమ్స్ డైరెక్టర్ డా. జైసింగ్ రాథోడ్, వైద్యులు అనంత్ రావ్, ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

# వైద్య వ్యర్థాల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి: జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్.



అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి జిల్లాలో వైద్య వ్యర్థాల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను



ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో వైద్య వ్యర్థాల నిర్వహణపై (బయో మెడికల్ వేస్టేజీ మేనేజ్మెంట్) అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్ లు, వ్యాధి నిర్ధారణ కేంద్రాలు, పశు ఆసుపత్రులు, వైద్య శిబిరాల్లో నుంచి నిరంతరం వైద్య వ్యర్థాల సేకరించి, ప్రభుత్వం నిర్ధారించిన శాస్త్రీయ పద్ధతుల్లో సేకరించి, నిర్వీర్యం చేయాలని అన్నారు. ఆసుపత్రుల నిర్వాహకులు నిబంధనల ప్రకారం ప్రత్యేకంగా వైద్య వ్యర్థాలు సేకరించాలన్నారు. వైద్య వ్యర్థాలను ఎట్టి పరిస్థితుల్లో నిబంధనలకు వ్యతిరేకంగా బయట పారివేయరాదని అన్నారు. ఇలా చేస్తే పర్యావరణానికి ఎంతో ప్రమాదం కలుగుతుందని చెప్పారు. ఇందుకు గాను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. అన్ని ఆసుపత్రులు తప్పనిసరిగా కాలుష్య నియంత్రణ అనుమతులు కలిగి ఉండాలని వివరించారు. అనుమతుల గడువులు ముగిస్తే ఎప్పటికప్పుడు రెన్యువల్ చేసుకుంటూ ఉండాలని తెలిపారు. అనుమతులు లేని, రెన్యువల్ చేసుకొని ఆసుపత్రులను గుర్తించి, కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో వైద్య, మున్సిపల్ శాఖల అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జుబ్లీహిల్స్‌లి ఉప ఎన్నిక ప్రచారంలో పాల్గొన్న అజయ్



అమృత తెలంగాణ హైదరాబాద్ న్యూస్ తెలంగాణ రాష్ట్రంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పాల్గొన్న యస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి అజయ్ కుమార్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఆత్మకూరి కాంతి కిరణ్ ఆదేశానుసారం వెంగళరావునగర్ డివిజన్ లో రాష్ట్ర కార్యదర్శి కొప్పు భాషా యస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు మాదారి చంద్రశేఖర్ తో కలిసి ఇంటింటికీ తిరిగి బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి ని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు లంకల దీపక్ రెడ్డి ని గెలిపించి ప్రధానమోదీకి కనుకాకగా ఇవ్వాలని ఓటరులని అభ్యర్థించారు

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిన ఎంపీడీవో గణేష్

నిర్మాణ పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు



ఇందిరమ్మ ఇల్లు ని పరిశీలించిన ఎంపీడీవో గణేష్

ఇబ్రహీంపట్నం అమృత్ తెలంగాణ అక్టోబర్ 28జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం ఎంపిడిఓ సిహెచ్ గణేష్ మంగళవారం అమ్మకపెట్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలనుపరిశీలించారు. లబ్ధిదారులు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నిర్మాణాలను వేగవంతంచేయాలని, ఇందుకోసం పంచాయతీ సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పథకంపై అధికారులకు తగిన సూచనలు చేశారు. అంతకు ముందు గ్రామపంచాయతీకార్యాలయం,అంగన్వాడీ కేంద్రాలను కూడా పరిశీలించారు.

# జిల్లా కలెక్టర్ మర్యాదపూర్వకంగా కలిసిన నూతన ఎంపీడీవోలు






అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి: గ్రూప్ -1 పరీక్షలో అర్హత సాధించి, ఇటీవలి జిల్లాలోని నాలుగు మండలాలకు కేటాయించబడిన నలుగురు ఎంపీడీవోలు, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌ను సోమవారం (27.10.2025) రాత్రి, వారి కుటుంబ సభ్యులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంపీడీవో విధులు, బాధ్యతలు గురించి వివరించారు. క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు పరుస్తున్న పథకాలన్నీ అర్హులైన పేదలందరికీ అందేలా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. కష్టపడి పని చేస్తూ, విధి నిర్వహణలో మంచి పేరు తెచ్చుకోవాలని, ఉద్యోగ జీవితంలో భవిష్యత్తులో ఉన్నత స్థానాల్లో నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

# వైద్య, నర్సింగ్ కళాశాలల నిర్మాణ పనులు వేగవంతం : జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి జిల్లా కేంద్రంలో వైద్య కళాశాల, నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులు పకడ్బందీగా కొనసాగుతున్నాయని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో, ఆర్అండ్‌బీ శాఖ పరిధిలో జరుగుతున్న ఈ పనులు ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగుతున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. మొత్తం 25 ఎకరాల విస్తీర్ణంలో కళాశాల భవనాలు, రహదారులు, ఇతర మౌలిక వసతుల పనులు వేగంగా జరుగుతున్నాయని వివరించారు. కళాశాల ప్రధాన భవనం, రోడ్డు నిర్మాణం, బాలక, బాలికల వసతి గృహాలు, ప్రిన్సిపల్, సూపరింటెండెంట్ వసతి గృహాలు, అతిథి గృహం, ఇతర విభాగాల పనులు ప్రస్తుతం ప్రగతిలో



నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించేందుకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడానికి, అన్ని సదుపాయాలతో కూడిన ఆధునిక కళాశాలను రూపుదిద్దుతున్నామని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటన లో పేర్కొన్నారు.

# విజిలెన్స్ అవగాహన వారోత్సవాల పోస్టర్ ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి : జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మంగళవారం సాయంత్రం కలెక్టరేట్లోని తన ఛాంబర్ లో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలకు సంబంధించి గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈనెల 27 వ తేదీ నుంచి, నవంబర్ రెండవ తేదీ వరకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వారోత్సవాల్లో భాగంగా విజిలెన్స్ ప్రాముఖ్యతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఈ గోడప్రతుల ఆవిష్కరణ కార్యక్రమంలో విజిలెన్స్ ఇన్స్ పెక్టర్ రవీందర్ సంతోషం,




అసిస్టెంట్ జియాలజిస్ట్ వెంకట్ రెడ్డి లు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.





అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మంగళవారం సాయంత్రం నిర్మల్ గ్రామీణ మండలం అనంతపెట్ గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కొనుగోలు కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన టెంట్, తదితర సౌకర్యాలను పరిశీలించారు. తప్పనిసరిగా సరిపడినన్ని గన్ని సంచులు, టార్పాలిన్లు, తేమ యంత్రాలు, తూకపు యంత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అందుబాటులో ఉన్న సామాగ్రికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు రైతులకు త్రాగునీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. అన్ని రకాల రిజిస్టర్లను పకడ్బందీగా నిర్వహించాలని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహకులను ఆదేశించారు. సరిపడినంత మంది సిబ్బంది ప్రతిరోజూ కొనుగోలు కేంద్రం వద్ద అందుబాటులో ఉండాలన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల వివరాలు, మద్దతు ధర, టోల్ ఫ్రీ నంబర్, తదితర వివరాలు రైతులకు తెలిసేలా బ్యానర్లను ప్రదర్శించాలని చెప్పారు.

రైతులతో ప్రతి రైతు తమ ధాన్యాన్ని ప్రభుత్వానికి మాత్రమే అమ్మాలని సూచించారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పిస్తుందని చెప్పారు. ప్రైవేటు వ్యక్తులను నమ్మి మోసపోవద్దని చెప్పారు. తప్పనిసరిగా తమ ధాన్యాన్ని శుభ్రపరచిన తర్వాతనే ధాన్యాన్ని అమ్ముకోవాలని తెలిపారు. దీని ద్వారా రైతులకు అధిక ధర లభిస్తుందని అన్నారు ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, తహసిల్దార్ ప్రభాకర్, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, రైతులు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ ఆర్థిక నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ముధోల్ :అమృత్ తెలంగాణ: ప్రతి ఒక్కరు సైబర్ ఆర్థిక నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ముధోల్ ఎస్ఐ బిట్ల పెర్సిస్ అన్నారు. ముధోల్ మండలంలోని చించాల గ్రామంలో మంగళవారం రాత్రి పోలిస్ శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, మూఢనమ్మకాల పట్ల అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా సైబర్ నేరాల పై విడియో రూపంలో ప్రదర్శించారు. అలాగే మూఢనమ్మకాల పై ప్రముఖ మెజిషన్ సుధాకర్ అవగాహన కల్పించారు. ఆనంతరం ఎస్ఐ మాట్లాడారు. అపరిచిత వ్యక్తులు పోన్ చేస్తే ఓటిపి చెప్పవద్దన్నారు. బ్యాంకు వారు నేరుగా ఎప్పుడూ పోన్ చేయరని తెలిపారు. ఈవిషయంను ప్రతి ఒక్కరు గమనించగలరని సూచించారు. ఇలాంటి పోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఏదైనా పోన్ కాల్స్ వస్తే పోలిస్ స్టేషన్ లో పిర్యాదు చేయాలని అన్నారు. గ్రామాల్లో బాబాల మోసాలు పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. యువకులు మత్తు పదార్థాల వాడకాన్నికి దూరంగా ఉండాలన్నారు. ఏదైనా సమాచారం తెలిసిన వెంటనే పోలిసులకు తెలియజేయలన్నారు. గ్రామంలో సిసి కెమెరాలను ఏర్పాటు చేయించుకోవాలని అన్నారు.

# బాధ్యతను సక్రమంగా నిర్వహించిన సబ్ కంట్రోల్ రూమ్ సిబ్బంది

**క్షణాల వ్యవధిలో స్పందించి పోగొట్టుకున్న బ్యాగు ను తిరిగి బాధితులకు అందించేలా కృషి.**
**బస్టాండ్ సబ్ కంట్రోల్ సిబ్బంది ఆటోలో మర్చిపోయిన బ్యాగు ను కష్టపడి తిరిగి బాధితులకు అందించేలా కృషి.**
**బ్యాగు నందు ఐదు గ్రాముల బంగారు కమ్మలు, పది తులాల వెండి ఆభరణాలు తిరిగి భద్రంగా బాధితులకు చేరవేత.**
**సిబ్బందిని అభినందించిన ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి.**




**అమృత్ తెలంగాణ అదిలాబాద్ ప్రతినిధి**

వివరాలలో ఆదిలాబాద్ సబ్ కంట్రోల్ నందు విధులు నిర్వర్తిస్తున్న ఏఆర్ఎస్ఐ ఎల్ దినకర్ వద్దకు బాధితురాలు సునీత ఉట్నూర్ ఎక్స్ రోడ్డు నివాసి, దీపావళి పండుగ నిమిత్తం సొంత ఊరుకు మహారాష్ట్రకు వెళ్లి ట్రైన్ నందు తిరిగి వచ్చి రైల్వే స్టేషన్ నుండి ఆటోలో బస్టాండ్ కు వచ్చింది ఈ క్రమంలో ఆటోలో తన బంగారు ఆభరణాలు మరియు వెండి ఆభరణాలు కలిగిన బ్యాగును మరిచిపోయింది. ఈ విషయంపై వెంటనే ఆదిలాబాద్ బస్టాండ్ నందు గల పోలీస్ సబ్ కంట్రోల్లో ఫిర్యాదు చేయగా వెంటనే స్పందించిన ఏ ఆర్ ఎస్సై ఎల్ దినకర్ మరియు మహిళ కానిస్టేబుల్ అపర్ణ లు కలిసి బాధితురాలు సునీత పిల్లలు తెలిపిన ఆధారాల ప్రకారం ఆటో కొరకై అన్వేషించగా ఆటోడ్రైవర్ జావిద్ నిజాయితీగా ఉంటూ తిరిగి తన బ్యాగును సబ్ కంట్రోల్ పోలీసులకు ఇవ్వగా, వీరందరూ బాధితురాలికి తిరిగి బ్యాగును అప్పగించడం జరిగింది. ఈ విషయమై విధి నిర్వహణలో నిజాయితీ మరియు త్వరగా స్పందించి, ఆటో కై అన్వేషించి దర్యాప్తు జరిపి బాధితులకు న్యాయం చేసే విధంగా కృషి చేసిన సిబ్బందిని ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి సిబ్బందిని ప్రత్యేకంగాఅభినందించారు. ఆటోడ్రైవర్ జావిద్‌కు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# పల్లె బాట(పొలం బాట )లోవిద్యుత్ అధికారులు

**పొలాల్లో రైతులకు అవగాహన సదస్సు.**
**గ్రామాల్లో రెండు మూడు రోజులుగా వెలగని వీధి దీపాలు.**

మల్లాపూర్ అమృత్ తెలంగాణ అక్టోబర్ 28 మల్లాపూర్ మండల గ్రామాల్లో ఏదైనా విద్యుత్ సమస్య ఉంటే ఒకప్పుడు రైతులు ,వినియోగదారులు అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగేవారు. కానీ ఇప్పుడు పల్లెబాట పేరుతో సమస్యలు పరిష్కరించేందుకు విద్యుత్ అధికారులు,సిబ్బంది స్వయంగా గ్రామాల్లో తిరుగుతున్నారు .పల్లెల్లో రైతులు అవగాహన లేమితో సొంతంగా పనులు చేసుకోవడం అజాగ్రత్త తో ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోవడం జరుగుతుంది కాబట్టి జీరో విద్యుత్ ప్రమాదాల జిల్లాగా ఉంచాలనే ఉద్దేశ్యంతో విద్యుత్ అధికారులు పొలాల్లో ఉన్న ట్రాన్స్ ఫార్మర్ల దగ్గరికి పోయి సమస్య పరిష్కరించడంతో పాటు కొంతమంది రైతులను గుమిగూడ్చి వారికి అవగాహన కల్పించడంలో భాగంగా ఏదైనా సమస్య అంటే సొంతగా మరమ్మతులకు దిగకుండా సంబంధిత అధికారులకు ఫోన్ చేయాలని తెలిపారు ఈ కార్యక్రమాలకు AE, DE లతో పాటు విద్యుత్ సిబ్బంది కూడా పాల్గొంటున్నారు.




పల్లె బాట ,పొలం బాట కార్యక్రమం లో భాగంగా రాఘవపేటలో

ఇదిలా ఉంటే

కొన్ని గ్రామాల్లో రాత్రి అయిందంటే వెలగాల్సిన వీధి దీపాలు ఒక్కోసారి రెండు మూడు రోజులుగా వెలగవు . లైన్ మెన్ కు చెప్తే గ్రామ పంచాయతీకి చెప్పమని,గ్రామపంచాయితీ కి చెప్తే లైన్ మెన్ కు చెప్పమని ఒకరి మీద ఒకరు తోస్తూ ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు .గత కొన్ని రోజులుగా గ్రామాల్లో ప్రధాన కూడలిలో హైమాస్ లైట్లు కూడా వెలగక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. తమ సిబ్బందికి పొలాల్లో ట్రాన్స్ ఫార్మర్ ల దగ్గర ఎలా చేయాలో శిక్షణ ఇచ్చారు కానీ, రాత్రయితే లైట్లు వేయడం ఎలాగో శిక్షణ ఇవ్వలేదని ప్రజలు భావిస్తున్నారు

# పోలీసుల అదుపులో 17 మంది, 29, 370/- నగదు,12 మొబైల్స్ స్వాధీనం

## జిల్లాలో పేకాట స్థావరల పై సీసీఎస్ పోలీసుల దాడి

కోరుట్ల: అమృత్ తెలంగాణ అక్టోబర్ 28: పట్టణంలో అష్టలక్ష్మి ఆలయ సమీపంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు పేకాట స్థావరం పై సీసీఎస్ పోలీసులు దాడి చేసి 10 మందిని అదుపులోనికి తీసుకొని వారి వద్ద నుండి 22,050/- నగదు,5 మొబైల్స్ స్వాధీనం చేసుకొని విచారణ నిమిత్తం కోరుట్ల పోలీస్ స్టేషన్ కు తరలించారు. మేడిపల్లి మం. కల్వకోట గ్రామ శివారులో పేకాట స్థావరం పై దాడి చేసి 7 గురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 7,320/- నగదు,7 మొబైల్స్ స్వాధీనం చేసుకొని విచారణ నిమిత్తం మేడిపల్లి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా సిసిఎస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ గారి ఆదేశాలతో అక్రమ,అసాంఘిక కార్యక్రమాలపై నిఘా పటిష్టం చేసి,పక్క సమాచారంతో దాడులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పేకాట ఆడిన, నిర్వహణ స్థావరాలు ఏర్పాటు చేసినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



# 100 కోట్ల విలువ గల ప్రభుత్వ ఆస్తి కబ్జా మాజీ మంత్రి: తాటిపర్తి జీవన్ రెడ్డి




జగిత్యాల అమృత్ తెలంగాణ అక్టోబర్ 28 జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో యాజమాన్య హక్కులు లేకుండా రూ. 100 కోట్ల విలువైన ఆస్తిని అక్రమంగా కబ్జా చేశారని మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఆరోపించారు. మంగళవారం జగిత్యాల ఇందిరా భవన్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పెట్రోల్, డీసెల్, కిరోసిన్ పంపుల కోసం కేటాయించిన స్థలాన్ని వారసత్వ ఆస్తిగా పంపకాలు చేసుకున్నారని తెలిపారు. పట్టణంలోని మున్సిపాలిటీకి చెందిన సర్వే నంబర్ 138లో ఈ కబ్జా జరిగినట్లు ఆయన పేర్కొన్నారు.

# కార్మిక వర్గ హక్కులకై సమరశీల ఉద్యమాలకు సిద్ధం కండి

మునుగోడు :అమృత్ తెలంగాణ: కార్మిక వర్గ హక్కుల సాధన కోసం కార్మికులందరూ సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు చినపాక పిలుపునిచ్చారు. మంగళవారం సిఐటియు మునుగోడు మండల జనరల్ బాడీ సమావేశం సత్యం ఫంక్షన్ హాల్ లో ఎర్రగోని లింగయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై కార్మిక వర్గం ఐక్యంగా సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. 1970లో ఐక్యత పోరాటం నినాదంతో సిఐటియు ఆవిర్భవించిందని నాటినుండి నేటి వరకు కార్మిక వర్గాన్ని ఒక వర్గంగా ఐక్యం చేయడం కోసం వారి హక్కుల కోసం అనేక ఉద్యమాలు నిర్వహించి విజయాలు సాధించిందని అన్నారు.

బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్ గా మార్చి కార్మిక వర్గాన్ని పెట్టుబడుదారులు మరింత దోపిడీ చేసుకోవడానికి అవకాశం ఇచ్చిందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ,దేశంలో సహజ వనరులన్నీ బడా కార్పొరేట్ పెట్టుబడుదారులకు అప్పనంగా అప్పజెప్తోందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందర కార్మిక వర్గానికి అనేక హామీలు ఇచ్చిందని ఏ ఒక్క హామీ అమలు చేయకుండా కార్మికులను మోసం చేసిందని విమర్శించారు. కార్మిక వర్గ సమస్యల పై చర్చించడానికి నవంబర్ 3వ వారంలో నల్లగొండలో జరిగే




సిఐటియు జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమములో మండల కన్వీనర్ వరికుప్పల ముత్యాలు, పిఎన్ఎం జిల్లా అధ్యక్షులు నాంపల్లి చంద్రమౌళి, రైతు సంఘం మండల అధ్యక్షులు వేముల లింగస్వామి, జీపీ మండల కార్యదర్శి బుడిగా లింగస్వామి, అండాలు, ఎర్రా అరుణ, డివైఎఫ్ఐ జిల్లా సహాయక కార్యదర్శి కట్ట లింగస్వామి, ఆశా వర్కర్స్ జ్యోతి, కమల, ధనలక్ష్మి, భవనం నిర్మాణ కార్మిక సంఘం పగడాల సైదులు, డాక్టర్ యూనియన్ యాట రామస్వామి, వెంకటేష్, మధ్యాహ్న భోజనం రాజ్యలక్ష్మి, అలివేలు, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

# స్త్రీ,శిశు,మహిళా అభివృద్ధి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మిషన్ పరివర్తన

**నషా ముక్త్ భారత్ అభియాన్ లో భాగంగా Say No To Drugs _ Yes To Dreams & Goals అవగాహన కార్యక్రమం.**



అమృత్ తెలంగాణ మెట్ పల్లి అక్టోబర్ 28: మెట్ పల్లి లోని రవీంద్ర కాలేజ్,నరేంద్ర కాలేజ్ ఐక్య మైండ్స్ లలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డ్రగ్స్ దుష్ప్రభావాలు, నివారణ పునరావాసం గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో

చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు కోట శివకుమార్, ఐసిపిఎస్ సిబ్బంది శ్రీవాణి,రాకేష్, అజిద్,అంగన్వాడి సూపర్వైజర్ ప్రతిభ,తదితరులు పాల్గొన్నారు.

# పత్తి రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలి: ఏఓ

రాజాపేట : అమృత్ తెలంగాణ: పత్తి రైతులు తప్పనిసరిగా విక్రయించడానికి తమ పేర్లను నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి పద్మజ కోరారు. మంగళవారం రాజాపేట విలేకరులకు వివరాలు చెప్పారు. ఆధార్ కార్డుకు ఫోన్ నెంబర్ లింక్ అయి ఉండి క్లస్టర్ ఏఈఓ లను సంప్రదిస్తే తమ మొబైల్ లో యాప్ వేసి స్లాట్ బుక్ చేయనున్నట్లు తెలిపారు. పత్తి అమ్మడానికి చౌటుప్పల్ ప్రభుత్వం మంజూరు చేసినదని ఆలేరు, జనగాం, జగదేవ్పూర్ లో అమ్మడానికి వీలుగా అనుమతి కావాలని కోరినట్లు తెలిపారు. కపాస్ కిసాన్ యాప్ లో స్లాట్ బుక్ అయితేనే విక్రయాలు జరుగుతాయని రైతులకు గుర్తించాలని సూచించారు. మండలంలో 17 రైతు ధాన్యం విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఐకెపి ఆధ్వర్యంలో 5, పిఎసిఎస్ రేణిగుంట ఆధ్వర్యంలో 12



ధాన్యం కొనుగోలు కేంద్రాలు నడుస్తాయని తెలిపారు. వాతావరణ దృష్ట్యా వరి కోత కోయని రైతులు ఇప్పుడే కోయవద్దని, కోసిన రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో పోసినట్లయితే మ్యాచర్ చూసి వెంటనే కాంటా చేసి మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు సూచించినట్లు తెలిపారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్ ఆదేశానుసారం అమలు చేయాలని కోరారు.

# జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బోరబండ డివిజన్ అబ్జర్వర్ గా సలీం

మిర్యాలగూడ : అమృత్ తెలంగాణ: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్ కేంద్రాలలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కోసం ఏఐసీసీ మైనార్టీ విభాగం చైర్మన్ ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్ అబ్జర్వర్లను నియమించారు. నల్గొండ జిల్లా మైనార్టీ విభాగం చైర్మన్ మహమ్మద్ అబ్దుల్ సలీం జూబ్లీహిల్స్ ఉపఎన్నిక లో బోరబండ డివిజన్ వార్డు నెంబర్ 103 అబ్జర్వర్ నియమించారు. ఈ సందర్భంగా సలీం విలేకరులతో మాట్లాడుతూ జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కోసం విస్తృత ప్రచారం ఈనెల 29 నుంచి చేపట్టనున్నట్లు ప్రకటించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాలను బోరుబండ డివిజన్ పరిధిలోని 103 వార్డులో ఇంటింటికి తిరిగి ప్రజలకు తెలియజేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేస్తానన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ గెలుపుతోనే సాధ్యమవుతుందన్నారు.

# సంపంగి వరి రకంపై రైతులకు అవగాహన..

ముథోల్ : : అమృత్ తెలంగాణ: ముథోల్ మండలంలోని ఎడ్ బిడ్ గ్రామ శివారులో గల కాశిరాం అనే రైతు పొలంలో మంగళవారం సంపంగి%-%15048 వరి రకంపై క్షేత్ర ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు పాల్గొని రైతులకు సంపంగి%-%15048 రకానికి సంబంధించిన ప్రత్యేకతలు, దిగుబడి లక్షణాలు, వ్యాధి నిరోధకత, తక్కువ కాలంలో పంట పండించే సామర్థ్యం వంటి అంశాలపై వివరంగా రైతులకు అవగాహన కల్పించారు. కంపెనీ ప్రతినిధులు ప్రవీణ్ రావు,శంకర్ పటేల్ లు మాట్లాడుతూ. సంపంగి రకం రైతులకు అధిక దిగుబడితో పాటు, మంచి ధాన్య నాణ్యతను ఇస్తుందని వారు తెలిపారు. తక్కువనీటివినియోగంతో ఎక్కువ ఉత్పత్తి సాధ్యమవుతుందని వివరించారు. ఈకార్యక్రమంలో పలువురు రైతులు, పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

# కురిక్యాల హెచ్ఎం, అటెండర్ సస్పెన్షన్



గంగాధర : అమృత్ తెలంగాణ: గంగాధర మండలం కురిక్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని బాలికలపై అటెండర్ లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటనలో జిల్లా ఉన్నతాధికారులు ఇద్దరిని సస్పెండ్ చేశారు. అదేవిధంగా పది మంది ఉపాధ్యాయులపై బదిలీ వేటు వేశారు. బాలికల ఫోటోలు తీసి మార్ఫింగ్ చేసి వేధింపులకు పాల్పడిన అటెండర్ ఎండి యాకుబ్ పాషాను పోలీసులు ఇప్పటికే అరెస్టు చేసి రిమాండ్ కు పంపించారు. విషయం తెలిసి పోలీసులకు సమాచారం ఇవ్వని పాఠశాల హెచ్ ఎంపై కూడా పోలీసులు కేసు వేశారు. ఈ సంఘటనపై విద్యార్థినుల తల్లిదండ్రులు పాఠశాల ఎదుట, రోడ్డుపై బైటాయించి ఆందోళనకు చేపట్టారు.

పాఠశాలలో పని చేస్తున్న అటెండర్ యాకుబ్ పాషా గత ఏడాది కాలంగా విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ వేధింపులకు పాల్పడమే కాక కొందరు బాలికల ఫోటోలు తీసి మార్ఫింగ్ చేసినట్టు అధికారులు, పోలీసుల విచారణలో వెల్లడైంది. అయితే ఎండి యాకుబ్ పాషా బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటనను ఉన్నతాధికారులకు నివేదించక పోగా.. వాస్తవాలు దాచడం, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అంశంపై జడ్పీహెచ్ఎస్ కురిక్యాల గ్రేడ్-2 గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు టి. కమలను విధుల నుండి సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఉత్తర్వులు జారీ చేశారు. బాలికలపై అటెండర్ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడనే ఆరోపణల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ముగ్గురు సభ్యుల అధికారుల బృందాన్ని విచారణకు ఆదేశించారు. ఈ క్రమంలో బృందం విచారణ చేపట్టి నివేదికను జిల్లా కలెక్టర్ కు సమర్పించింది.

దీంతో ప్రధానోపాధ్యాయురాలు కమల విధుల నుండి సస్పెండ్ చేయగా.. నిర్లక్ష్యంగా వ్యవహరించిన పది మంది ఉపాధ్యాయులపై బదిలీ వేటు వేశారు. అయితే జరిగిన సంఘటనను నిరసిస్తూ విద్యార్థినుల తల్లిదండ్రులు పాఠశాల ఆవరణలో, రోడ్డుపై బైటాయించి ఆందోళన చేపట్టారు. ఈ అమానుష ఘటనపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయి కుమార్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తీవ్రంగా ఖండించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ అధికారులతో మాట్లాడారు. ఈ ఘటనను నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మధురానగర్ చౌరస్తా రోడ్డుపై బైటాయించి రాస్తారోకో, ధర్నా చేపట్టారు. ఈ ఘటనను నిరసిస్తూ బీజేపీ, బీఆర్ఎస్, యువత ఇచ్చిన గంగాధర మండల బంద్ సంపూర్ణం అయ్యింది. దుకాణ సముదాయాలు, పలు షాపులు మూసివేసి బంద్ పాటించారు.

# విద్యా సంస్థల బంద్ ను విజయవంతం చేయాలి: ఎస్ఎఫ్ఐ



మొయినాబాద్ : అమృత్ తెలంగాణ: విద్యా సంస్థల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిర్వహించే బంద్ ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శంకర్ అన్నారు. ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి అరుణ్ కుమార్ అధ్యక్షతన మున్సిపల్ పరిధిలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గత ఆరేళ్ల నుండి స్కాలర్షిప్ విడుదల చేయకుండా చేస్తే విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ల కావస్తున్న విద్యార్థులకు ఇవ్వాల్సిన రూ. 8వేల కోట్లు ఇప్పటికీ విడుదల చేయాకపోవడం సిగ్గు చేటు అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆచరణలో మాత్రం శూన్యమన్నారు. విద్య వ్యవస్థ పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్లో ఉన్న ఉపకార వేతనాలు వేతనాలను తక్షణమే రక్షణను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో

జిల్లా సహాయ కార్యదర్శి బి. అరుణ్, జిల్లా నాయకులు వేణు, ఎస్ఎఫ్ఐ మొయినాబాద్ మండల అధ్యక్ష కార్యదర్శులు రేశ్వంత్,చరణ్ గౌడ్, చేవెళ్ల మండల కార్యదర్శి మాల చందు, ఎస్ఎఫ్ఐ చేవెళ్ల మండల సహాయ కార్యదర్శి మణికంఠ, మొయినాబాద్ మండల నాయకులు, విష్ణు, రవీందర్, ప్రదీప్ రెడ్డి,కాళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల ధాన్యం ఎప్పటికప్పుడు తీసుకోవాలి



రాజన్న సిరిసిల్ల :అమృత్ తెలంగాణ: ఖరీఫ్ సీజన్ కు సంబంధించి కొనుగోలు కేంద్రాలను ట్యాగ్ చేసిన మిల్లర్లు ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తీసుకోవాలని ఇంచార్జ్ కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఖరీఫ్ సీజన్ ధాన్యం, పత్తి, మొక్కజొన్న తదితర పంట ఉత్పత్తుల కొనుగోలు ఇతర అంశాలపై జిల్లాలోని రా, బాయిల్డ్ రైస్ మిల్లర్లు, జిన్నింగ్ మిల్లర్లు వివిధ శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయంలోని ఆడిటోరియంలో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడారు.

ప్రభుత్వ నిబంధనలకనుగుణంగా కొనుగోలు కేంద్రాలను ట్యాగ్ చేసిన మిల్లర్లు రైస్ మిల్లర్లు ధాన్యాన్ని ఎప్పటికప్పుడు దించుకొని ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. కావాల్సిన హమాలీలను సిద్ధంగా ఉంచుకోవాలని, ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. బ్యాంకు గ్యారంటీ, అగ్రిమెంట్లు రెండు రోజుల్లోగా అందజేయాలని సూచించారు. 2024- 25 ఖరీఫ్, యాసంగి సీజన్ సంబంధించిన సీఎంఆర్ గడువులోగా అందించాలని ఆదేశించారు. మిల్లులోని గన్ని సంచులను ఆయా కొనుగోలు కేంద్రాలకు వెంటనే తరలించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా రైస్ మిల్లర్లు ముందుకు వెళ్లాలని, వాటిని అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. రైస్ మిల్లర్ల ఇబ్బందులను పౌరసరఫరాల శాఖ దృష్టికి తీసుకెళ్తామని పరిష్కరించిన కృషి చేస్తామని స్పష్టం చేశారు.

జిన్నింగ్ మిల్లులో మిల్లుల్లో వసతులు కల్పించాలి

జిల్లాలోని ఐదు సీసీఐ కొనుగోలు కేంద్రాలైన జిన్ను మిల్లుల వద్ద పత్తి రైతులకు కనీస వసతులు కల్పించాలని ఇంచార్జి కలెక్టర్ ఆదేశించారు. ఆయా కొనుగోలు కేంద్రాల వద్ద మద్దతు ధర, లికపాస్ కిసాన్లి అప్లికేషన్లో స్లాట్ బుకింగ్ తదితర అంశాలు తెలిపేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తూనికలు కొలతలు శాఖ వారి ఆమోదించిన కాంటాలను వినియోగించాలని, అగ్నిమాపక శాఖ నుంచి అనుమతులు పొందాలని ఆదేశించారు. జిల్లాలోని 29 వేల మంది రైతులు లికపాస్ కిసాన్లి లో వివరాలు నమోదు చేసుకున్నారని సీసీఐ అధికారులు ఇంచార్జి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు రెండు ఏర్పాటు చేశామని ఆయా ప్రాంతాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఇంచార్జి కలెక్టర్ సూచించారు. సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్డీఓ శేషాద్రి, డీసీఎస్ఓ చంద్ర ప్రకాశ్, డీఏఓ అఫ్జల్ బేగం, డీసీఓ రామకృష్ణ, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్, మార్కెటింగ్ శాఖ అధికారి ప్రకాష్, మార్కెఫేడ్ అధికారి హబీబ్, సీసీఐ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానం ప్రాణదానంతో సమానం: ఎస్పీ మహేష్ బి. గితే

రాజన్న సిరిసిల్ల :అమృత్ తెలంగాణ: రక్తదానం ప్రాణదానంతో సమానమని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే అన్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణ పరిధిలోని కల్యాణ లక్ష్మీ గార్డెన్స్లో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగా స్వయంగా ఎస్పి రక్తదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారి జీవితాలను కాపాడడంలో రక్తదానం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అమరవీరుల వారోత్సవాల సందర్భంగా స్వచ్ఛందంగా యువత ,ప్రజలు,ఆటో డ్రైవర్లు,పోలీస్ అధికారులు, సిబ్బంది సుమారు 460 మంది రక్తదాన శిబిరంలో పాల్గొనడం అభినందించదగ్గ విషయమని,విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల త్యాగాలను సమాజం ఎప్పటికీ మరువదని, వారి జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం పోలీస్ ఫ్లాగ్ డే నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. పోలీసులు కేవలం శాంతి భద్రతలను పరిరక్షించడమే కాకుండా సేవా కార్యక్రమాల్లోను ముందు వరసలో వుంటారని, ముఖ్యంగా రక్తదానంపై వున్న అపోహలను నమ్మకుండా ప్రతి ఒక్కరు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు.మనం చేసే రక్తదానం వలన అత్యవసర సమయంలో,ప్రమాద సమయంలో ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి,తల సేమియా వ్యాధిగ్రస్తులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, సి.ఐ లు కృష్ణ, మొగిలి, శ్రీనివాస్, వీరప్రసాద్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, మధుకర్, నటేష్,ఆర్.ఐ లు మధుకర్, రమేష్, యాదగిరి, ఎస్.ఐ లు, డాక్టర్ సంధ్యారాణి,కరీంనగర్, సిరిసిల్ల, నిజామాబాద్ జిల్లాకు చెందిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు గుడ్లరవి,పెంద్యాల కేశవరెడ్డి, బుస్స ఆంజనేయులు, ప్రయాకర్ రావు వేణు తదితరులు పాల్గొన్నారు.

# పెళ్లి వార్తలపై నిత్యా మీనన్ వింత రియాక్షన్



అలా మొదలైంది అంటూ తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ నిత్యా మీనన్ అతి త్వరలో మలయాళ నటుడితో ఏడు అడుగులు నడవబోతుంది. వీరిద్దరు కొన్నాళ్లుగా ప్రేమలో ఉన్నారు. వీరి ప్రేమకు ఇరువైపుల పెద్దల నుండి అంగీకారం లభించింది. దాంతో పెళ్లికి సిద్ధం అయ్యారు అంటూ పుకార్లు పెద్ద ఎత్తున షికారు చేస్తున్నాయి. సోషల్ మీడియాలో మరియు మెయిన్ స్ట్రీమ్ మీడియాల్లో కూడా నిత్యా మీనన్ పెళ్లి గురించి పెద్ద ఎత్తున వార్తలు వచ్చిన నేపథ్యంలో అంతా నిజమే అనుకొని ఏకంగా శుభాకాంక్షలు తెలియజేయడం తో పాటు.. ఆ మలయాళ హీరో ఎవరై ఉంటారా అంటూ గూగుల్ చేస్తున్నారు. నిత్యా మీనన్ పెళ్లి తర్వాత సినిమాలు చేస్తుందా లేదా అనే చర్చ కూడా మొదలు అయ్యింది. ఈ సమయంలో ఆపండ్రోయ్ అంటూ నిత్యా మీనన్ రియాక్షన్ ఇచ్చింది. నాకు తెలియకుండానే నా పెళ్లి చేస్తున్నారా.. మీడియా నిజానిజాలు తెలుసుకుని కథనాలు ప్రసారం చేయాలి. ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు ప్రచారం చేస్తారా? పెళ్లి వార్తలు పూర్తిగా అవాస్తవం. పెళ్లి గురించి ప్రస్తుతానికి ఎలాంటి ఆలోచన లేదని నిత్యా మీనన్ క్లారిటీ ఇచ్చేసింది. నిప్పు లేనిదే పొగ రాదు అంటారు.. మరి నిత్యా మీనన్ కు ఆ హీరో తో ఎలాంటి వ్యవహారం లేకుంటే ఎందుకు పెళ్లి వరకు పుకార్లు వచ్చాయి అనేది కొందరి అనుమానం. ఆ విషయమై నిత్యా మీనన్ మాత్రం స్పందించలేదు. పెళ్లి వార్తలను కొట్టి పారేసిన ఈ అమ్మడు ప్రస్తుతానికి ప్రేమలో కూడా లేను అన్నట్లుగా పేర్కొంది. తెలుగు తో పాటు తమిళం.. మలయాళంలో కూడా ఒకప్పుడు ఫుల్ బిజీగా ఉన్న నిత్యా ఇప్పుడు మాత్రం కాస్త డల్ అయ్యింది. అందుకే పెళ్లి వార్తలు వచ్చాయని అంటున్నారు. నిత్యా మీనన్ తెలుగు లో భీమ్లా నాయక్ సినిమా చేసింది. ప్రస్తుతానికి ఒక లేడీ ఓరియంటెడ్ సినిమాను ఈమె చేస్తున్నట్లుగా తెలుస్తోంది.

# నిధి ఎక్కడ?.. నభా ఏమైపోయింది?





టాలీవుడ్ తెరకి నిధి అగర్వాల్ .. నభా నటేశ్ ఒకే సమయంలో పరిచయమయ్యారు. నిధి చక్కని కనుముక్కుతీరుతో ఆకట్టుకుంది. 'సవ్యసాచి'లో నిధిని చూసినవాళ్లంతా ఈ మధ్య కాలంలో ఇలాంటి పిల్ల ఇండస్ట్రీకి రాలేదని అనుకున్నారు. దొండ పండులాంటి ఈ పిల్లకి ఢోకా లేదని చెప్పుకున్నారు. ఆ తరువాత చేసిన 'మిస్టర్ మజ్ను' సినిమా కూడా సరిగ్గా ఆడలేదు. అయినా ఏకంగా పూరి సినిమాలోనే ఛాన్స్ కొట్టేసింది. ఇక మరో వైపున 'నన్ను దోచుకుందువటే' సినిమాతో తెలుగు తెరకి పరిచయమైన నభా కూడా అటు ఇటు తిరిగి 'ఇస్మార్ట్ శంకర్' ప్రాజెక్టులోకి వచ్చింది. నిధి చూస్తేనేమో సన్నజాజి కి కాస్త ఇటుగా .. సంపెంగకి కాస్త అటుగా అనిపిస్తుంది. ఇక నభా విషయానికి వస్తే చామంతికి .. ముద్దబంతికి అటు ఇటుగా కనిపిస్తుంది. ఇద్దరూ ఈ సినిమాలో అందాలు ఆరబోయడానికి వెనుకాడలేదు .. మొహమాటపడలేదు. ఈ సినిమాలోని మాస్ సాంగ్స్ లో ఈ ఇద్దరూ కలిసి చేసిన రచ్చ అంతా ఇంతా కాదు. ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర భారీ హిట్ ను నమోదు చేయడంతో ఇక ఈ భామలను పట్టుకోవడం కష్టమే అనుకున్నారు. అవకాశాలన్నీ ఈ అందాల భామల చుట్టూనే ప్రదక్షిణం చేస్తాయని భావించారు. అయితే ఈ ఇద్దరి భామల్లో నిధి అంత స్పీడ్ చూపించలేదు. కోలీవుడ్ వైపు చూస్తూనే తెలుగులో 'హీరో' అనే ఒక సినిమా చేసింది. ఒక వైపున పవన్ కల్యాణ్ తో చేస్తున్న 'హరిహర వీరమల్లు' సినిమా సెట్స్ పై ఉండగానే ఆమె ఒక కొత్త హీరోతో సినిమా చేయడం ఆమెకే చెల్లింది. ఆ సినిమా ఆమె కెరియర్ కి ఏమైనా హెల్ప్ అయిందా అంటే అదీ లేదు. పోనీ ఈ సినిమా తరువాతైనా మిగతా ప్రాజెక్టులు ఏమైనా లైన్లో పెట్టిందా అంటే అదీ లేదు. ఇంత అందం పెట్టుకుని ఇంటి పట్టున కూర్చోవడం కూడా ఆమెకే చెల్లింది. ఇక నభా విషయానికి వస్తే .. అవకాశాలను ఎంత ఫాస్టుగా అందుకోవచ్చునో చూపించింది. 'డిస్కోరాజా' .. 'సోలో బ్రతుకే సో బెటర్' .. 'అల్లుడు అదుర్స్' .. 'మాస్ట్రో' సినిమాలను చకచకా చేసేస్తూ వెళ్లింది. అయితే ఈ సినిమాలన్నీ ఒక దాని తరువాత ఒకటిగా వచ్చాయి.. పోయాయి. సక్సెస్ లు మాత్రం ఎక్కడో ఏదో తట్టుకుని ఆగిపోయాయి. ఆ తరువాత నుంచి నభాకి కూడా అవకాశాలు లేవు. నిదానమే ప్రధానమన్నట్టుగా ఉన్న నిధి పరిస్థితి .. ఆలస్యం అమృతం విషం అన్నట్టుగా దూకుడుగా వెళ్లిన నభా పరిస్థితి ఒకేలా ఉంది. అందుకే అంటారు.. కొత్త కథానాయికలు వచ్చేలోగా కొంతైనా వెనకేసుకోవాలని!

# నివేదా థామస్ గ్యాప్ తీసుకుందా? లేక వచ్చిందా?



నివేదా థామస్.. ఈ డింపుల్ సుందరి గురించి ప్రత్యేకమైన పరిచయాలు అవసరం లేదు. కేరళలో పుట్టిన ఈ అందాల భామ.. మలయాళ చిత్రంతో బాలనటిగా తన కెరీర్ని స్టార్ట్ చేసి ఆ తర్వాత హీరోయిన్ గా మారింది. న్యాచురల్ స్టార్ నాని హీరోగా తెరకెక్కిన జెంటిల్ మేన్ మూవీతో టాలీవుడ్ లోకి అడుగు పెట్టింది. తొలి సినిమాతోనే తన అందం అభినయం అంతకు మించిన టాలెంట్ తో ప్రేక్షకులను కట్టిపడేసిన నివేదా థామస్.. ఆపై తెలుగులో వరుస అవకాశాలను అందిపుచ్చుకుంది. ఈ క్రమంలోనే నిన్ను కోరి జై లవకుశ 118 బ్రోచేవారెవరురా వంటి హిట్ చిత్రాలను ఖాతాలో వేసుకుంది. మరోవైపు తమిళ మలయాళ భాషల్లోనూ నటించిన నివేదా.. గత కొంత కాలం నుండి చాలా సైలెంట్ గా ఉంటోంది. సోషల్ మీడియాలో తప్పా సినిమాల్లో కనిపించడం లేదు. ఈమె నుండి చివరిగా వచ్చిన చిత్రం వకీల్ సాబ్ . పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా వేణు శ్రీరామ్ దర్శకత్వంలో వచ్చిన కోర్ట్ డ్రామా మూవీ ఇది. బాలీవుడ్ లో అమితాబ్ బచ్చన్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన పింక్ సినిమాకు రీమేక్ గా వకీల్ సాబ్ ను రూపొందించారు. ఇందులో నివేదా థామస్ తో పాటు అంజలి అనన్య నాగళ్ల కీలక పాత్రలను పోషించారు. 2021లో విడుదలైన ఈ చిత్రం సూపర్ హిట్ గా నిలిచింది. అలాగే ఇందులో వేముల పల్లవిగా నటించిన నివేదా థామస్ కు విమర్శకుల ప్రశంసలు దక్కాయి.

## అమృత్ తెలంగాణ సినిమా వార్తలు

# ఘాటుగా వడ్డిస్తున్నా టూ లేట్ అమ్మడూ



ఉత్తరాది బ్యూటీ సిద్ధిక శర్మ పరిచయం అవసరం లేదు. నాని - కృష్ణవంశీ కాంబో తెరకెక్కించిన 'పైసా'లో హాటీగా మురిపించింది ఈ బ్యూటీ. నాక్కూడా ప్రకాష్ అంటే ఇష్టం... హీ ఈజ్ స్వీట్ హార్ట్!! అంటూ వచ్చీ రాని తెలుగు మాట్లాడి తెగ కవ్వించిన ఈ బ్యూటీ పైసా ఫ్లాపవ్వడంతో ఐపు లేకుండా పోయింది. టాలీవుడ్ కలలన్నీ మొదటి ప్రయత్నమే ఆవిరైపోవడంతో ఇక ముంబై పలాయనం చిత్తగించింది. అయితే అప్పుడు మిస్సయిన సిద్ధిక సోషల్ మీడియాల్లో మాత్రం ఫ్యాన్స్ కి టచ్ లోనే ఉంది. నిరంతరం ఈ భామ బికినీ బీచ్ ఫోటోలతో టచ్ లోనే ఉంటుంది. అందాల్ని ఆరాంగా తెరనిండుగా పరిచేసేందుకు ఏమాత్రం అభ్యంతరం చెప్పని ఈ ఉత్తరాది భామ లేటెస్ట్ ఫోటో షూట్ యూత్ వాట్సాపుల్లో.. సోషల్ మాధ్యమాల్లో జోరుగా వైరలవుతోంది. తాజాగా సిద్ధిక టాప్ లెస్ ఫోటోలు దుమారం రేపుతున్నాయి. తాజా ఫోటోషూట్ వీక్షించాక.. యూత్ చెలరేగుతోంది. ఏట వాలుగా అందాల వలలు విసురుతోంది! అంటూ ఘాటైన వ్యాఖ్యలు చేస్తున్నారు. ఉత్తరాది పరిశ్రమలో సిద్ధికకు సరైన ఆఫర్లు లేవు. దీంతో ఇటు దక్షిణాదిపైనే పూర్తిగా దృష్టి సారించింది. జాబీ మ్యూజిక్ ఆల్బమ్ లతో లైమ్ లైట్ లోకి వచ్చి మోడలింగ్ లో బిజీ అయ్యాక అందరు భామల్లానే ఈ బ్యూటీ కూడా టాలీవుడ్ పై గురి పెట్టింది.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com